సాక్షి అనకాపల్లి

ఆదివారం, 9, మార్చి, 2025



వెంకన్న పెళ్లికొడుకాయెనే

ఈ నెల 10వ తేదీ సోమవారం రాత్రి ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణానికి నేడు అంకురార్పణ జరగనుంది.

8లో



మంచినీటి ట్యాంక్ పైకి ఎక్కి యువకుడి హల్‌చల్

8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	ఆది	సోమ
అనకాపల్లి	6.10	4.54
నర్సీపట్నం	6.10	4.54



మహిళలు అన్నింటా సమానులు..

- ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి..
- ఉత్పాదక యూనిట్ల స్థాపనకు ప్రోత్సాహం
- ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవిని సన్మానిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, స్పీకర్ అయ్యన్నపాత్రుడు తదితరులు

సాక్షి, అనకాపల్లి : మహిళలు ఉత్పాదక యూనిట్లు స్థాపించి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని రాష్ట్ర అబ్కారీ, భూగర్భ గనుల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పెంటకోట కన్వెన్షను హాలులో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మహిళా దినోత్సవ కార్యక్రమం జరిగింది. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, పార్లమెంటు సభ్యుడు సీఎం రమేష్, జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, జేసీ ఎం. జాహ్నవి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, శాసన సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మహిళలు వారి హక్కుల కోసం అనేక పోరాటాలు, త్యాగాలు చేసి1911 మార్చి 8వ తేదీన మహిళా దినోత్సవంగా సాధించుకున్నారని తెలిపారు. 2025 సంవత్సరానికి 'మహిళలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు, సమాన పదవులు' థీమ్‌గా మహిళా దినోత్సవాన్ని జరుపుకొంటున్నట్లు తెలిపారు. ప్రోత్సాహక యూనిట్లు స్థాపనకు జిల్లాలో కోడూరు వద్ద 30 ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందని, ఎవరైనా యూనిట్ల స్థాపనకు ముందుకు వస్తే వారికి రటన్ టాటా ఇన్నోవేషన్ వారిచే శిక్షణ అందించి, వారికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం దీపం పథకం అమలు, పెన్షన్లు మొత్తం పెంపు, అన్నా కేంటీన్లు తిరిగి ప్రారంభం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మే నెల నుంచి తల్లికి వందనం, రైతులకు, మత్స్యకారులకు భరోసా పథకాలు అందించడం జరుగుతుందన్నారు.

అన్ని రంగాల్లో నాయకత్వం : స్పీకర్ అయ్యన్న

స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో నాయకత్వం వహిస్తున్నారని, ప్రస్తుతం జిల్లాను విజయపథంలో నడిపించేది మహిళా అధికారులేనని కొనియాడారు. మహిళల ఆర్థికాభివృద్ధికి స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయడం జరిగిందని, సంఘాలు బలోపేతమై ప్రభుత్వానికే అప్పు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

నమ్మకంతో ముందడుగు : కలెక్టర్ విజయకృష్ణన్

జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ మాట్లాడుతూ మహిళలకు సమాన హక్కులు, సమాన వేతనం కొరకు ఎన్నో పోరాటాలు చేసి హక్కులు సాధించుకున్నామని, అందుకు గుర్తుగా అదే స్ఫూర్తిని కొనసాగించుటకు ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకొంటున్నట్లు తెలిపారు. స్త్రీ పుట్టుకతోనే బలమైనదని, స్త్రీ అద్భుతాలు సృష్టించగలదని, ప్రతి స్త్రీ తనపైన నమ్మకంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టరు పిలుపునిచ్చారు.

మహిళల రక్షణకు శక్తి మహిళ యాప్ : ఎస్పీ సిన్హా

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ పోలీసు శాఖలో మహిళా ఉద్యోగులు పురుషులతో సమానంగా పనిచేస్తున్నారని తెలిపారు. మహిళల రక్షణకు పోలీసుశాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని, మహిళలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే 112 నంబరుకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చునన్నారు. ప్రభుత్వం ప్రారంభిస్తున్న శక్తి మహిళా యాప్ ప్రతి మహిళ వారి మొబైల్‌లో నిక్షిప్తం చేసుకొని సహాయం కొరకు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ రమేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, రమేష్ బాబు , జేసీ జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణరావు, ఆర్‌డీవో షేక్ ఆయిషా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ శచీదేవి, మహిళా, శిశు సంక్షేమశాఖ పీడీ అనంత లక్ష్మి, సివిల్ సప్లయి డీఎం జయంతి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మిల్క్ బ్యూటీ మెరుపులు



8లో

- మామూళ్లు.. గమ్మత్తుగా!

ఒక్కో దుకాణానికి రూ.2.5 లక్షలు!



- మద్యం షాపుల నుంచి నెలవారీ వసూళ్లు మరూ
- బెల్టు షాపులకు రూ.10 అధిక ధరకు అమ్మకం
- సమావేశం పెట్టి మరీ టార్గెట్ విధింపు
- వచ్చే ఏడాది నుంచి రూ.3 లక్షలు ఇవ్వాలని ఆదేశాలు
- బెంగళూరు నుంచి వచ్చిన నేత ద్వారా కలెక్షన్లు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఇప్పటికే ప్రైవేటు పీఏ వ్యవహారంలో విమర్శలు ఎదుర్కొంటున్న కూటమి నేత ఒకరు... ఇప్పుడు కలెక్షన్ల కోసం ఏకంగా బెంగళూరు నుంచి ఓ వ్యక్తిని తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. ముందుగా నియోజకవర్గంలోని మొత్తం మద్యం షాపుల నుంచి మామూళ్లు వసూలు చేయాలని భావించారు. ఇందుకు అనుగుణంగా మద్యం షాపు సిండికేట్లతో గత నెలలో సమావేశం ఏర్పాటు చేసి మరీ టార్గెట్లు ఫిక్స్ చేసినట్టు తెలుస్తోంది. ప్రతి మద్యం షాపు యజమాని ప్రతి నెలా రూ.2.5 లక్షల చొప్పున చెల్లించాలని ఆదేశాలు జారీ అయినట్టు సమాచారం. ఇందుకు ప్రతిఫలంగా సదరు ప్రైవేటు మద్యం దుకాణదారుడు బెల్టు షాపులకు ఎమ్మార్పీ మీద రూ.10 అధికంగా విక్రయించుకునేలా ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా ఆయా దుకాణాల పరిధిలో బెల్టు షాపులకు మద్యం సరఫరా బాధ్యత కేవలం వారికే దక్కేలా నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఆయా మద్యం షాపులతో పాటు బెల్టు షాపుల జోలికి ఎక్సైజ్‌శాఖ అధికారులు వెళ్లకుండా కూడా ఆదేశాలు జారీ కావడం విశేషం. వచ్చే ఏడాది నుంచి ప్రతి నెలా వసూళ్ల మొత్తం రూ.3 లక్షలకు పెంచనున్నట్టు కూడా ముందుగానే ప్రకటించినట్టు సమాచారం. మొత్తంగా ఒక ప్రైవేటు పీఏ వ్యవహారంలో విమర్శల నేపథ్యంలో దూరంగా పెట్టిన సదరు నేత.. ఇప్పుడు బెంగళూరు నుంచి వచ్చిన మరో వ్యక్తి ద్వారా వసూళ్లకు దిగడం చర్చనీయాంశమవుతోంది.

విచ్చలవిడిగా బెల్టు షాపులు!

ఇప్పటికే పేకాట, కోడి పందేల వ్యవహారంలో వార్తలకెక్కిన సదరు నేత.. ఇప్పుడు విచ్చలవిడిగా మద్యం బెల్టు దుకాణాలకు కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా పేకాట డెన్‌ల నిర్వహణలో కొంత మొత్తం వసూలు చేసేందుకు మరీ అనుమతి ఇచ్చారు. వాటి జోలికి వెళ్లకుండా కూడా కొద్దిరోజుల పాటు నియంత్రించగలిగారు. అయితే అంతర్గత విభేదాల కారణంగా ఈ వ్యవహారం కాస్తా బయటకు వచ్చింది. దీంతో తాత్కాలికంగా పేకాట శిబిరాలు మూతపడ్డాయి. ఇక కోడి పందేల శిబిరాలు ఏ నియోజకవర్గంలో లేని విధంగా ఏకంగా మూడు ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశారు. అధికారికంగా సదరు నేత పాల్గొనకపోయినా వారి అండతోనే ఈ వ్యవహారం నడిచింది. దీంతో అటువైపు పోలీసులు కన్నెత్తి చూడలేదు. పైగా కోడి పందేల శిబిరాల ప్రాంతంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కూడా జరిగాయి. బహిరంగంగానే మద్యాన్ని విక్రయించారు. వీటి ఏర్పాట్లకు కూడా వేలం పాట నిర్వహించి మరీ వసూళ్లకు తెగబడ్డారు. మరోవైపు ఇప్పటికే సదరు నేత నియోజకవర్గంలో భారీగా బెల్టు షాపులు వెలిశాయి. బెల్టు షాపుల కోసం వేలం పాట నిర్వహించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయి. అయినా సదరు నేత అండదండలతో చర్యలు తీసుకోలేదని విమర్శలున్నాయి. కేవలం ఈ నియోజకవర్గంలోనే ఏకంగా వందకుపైగా బెల్టు షాపులు ఏర్పాటైనట్టు సమాచారం. మద్యం దుకాణదారులు ఆయా బెల్టు షాపులకు ఎమ్మార్పీకి రూ.10కి అధికంగా మద్యం విక్రయించుకుంటున్నారు. ఇందులో వచ్చే సగం ఆదాయాన్ని సదరు నేతకు ముట్టచెబుతున్నట్టు తెలుస్తోంది.

బెంగళూరుకు చెందిన వ్యక్తి ద్వారా..!

వాస్తవానికి సదరు నేతకు ఏళ్లుగా నమ్మినబంటుగా ఉన్న వ్యక్తి ద్వారా అన్ని వ్యవహారాలు నడిపేవారు. అయితే సదరు వ్యక్తిపై సొంత పార్టీ నేతలే ఫిర్యాదు చేయడంతో పక్కన పెట్టినట్టు వార్తలు వచ్చాయి. ఆ స్థానంలో తనకు నమ్మిన బంటుగా ఉన్న మరో వ్యక్తిని బెంగళూరు నుంచి ప్రత్యేకంగా పిలిపించినట్టు ఆ పార్టీ నేతలే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మద్యం సిండికేట్ల ద్వారా వసూలు చేసే మొత్తం కూడా సదరు బెంగళూరు వ్యక్తి చేతికి చేరుతున్నట్టు తెలుస్తోంది. మరోవైపు కొద్దిరోజుల క్రితం సెజ్‌లోని ఒక కంపెనీలో సీసీ కెమెరాలను బిగించే పని ఇప్పించడం కోసం కూడా రూ.3 లక్షల మేర వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఈ తతంగమంతా కూడా బెంగళూరు వ్యక్తి ద్వారానే నడిచినట్టు సమాచారం. మొత్తంగా పీఏలు మారుతున్నారు తప్ప వసూళ్ల కార్యక్రమం మాత్రం తమకు తప్పడం లేదని సొంత పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. బెంగళూరు వ్యక్తిపై కూడా ఫిర్యాదు చేసేందుకు ఆ పార్టీ నేతలే సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

యథావిధిగా రేపు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం

తుమ్మపాల : జిల్లాలో ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఈ నెల 10 సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంను యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ప్రజలకు మరింత సమర్థవంతంగా అమలు చేసే నిమిత్తం జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంతో పాటు, డివిజన్, మండల, మున్సిపల్ కార్యాలయాలు, గ్రామసచివాలయాలలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆర్డీవో కార్యాలయం, మండల తహసీల్దార్, ఇతర కార్యాలయాల్లో ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

మహిళా నాయకత్వానికి ఎంతో ప్రోత్సాహం





అనకాపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ సత్యవతి తదితర మహిళా నాయకులను సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

- స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే
- పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు
- పార్టీ కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

అనకాపల్లి టౌన్: మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని రింగ్‌రోడ్ పార్టీ కార్యాలయంలో మహిళా దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన పార్టీ ఒక్క వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీనేనని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ మహిళా విభాగం ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం అతిథులను శాలువాతో సత్కరించి చిరు జ్ఞాపికలను అందజేశారు. మాజీ ఎంపీ భీశెట్టి సత్యవతి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ జిల్లా పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, కశింకోట ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్ మలసాల రమణారావు, పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు ఎల్ సుజాత, పెందుర్తి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు నదియా, పట్టణ మహిళా కార్పొరేటర్లు జాజుల ప్రసన్న లక్ష్మి, పీలా సౌజన్య, జిల్లా మాజీ మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, అమృతవల్లి, కొత్తూరు సర్పంచ్ ఎస్ లక్ష్మి, నియోజకవర్గ పార్టీ నాయకులు నీటిపల్లి లక్ష్మి, పండాడి పద్మ, మరిపల్లి శోభ, కొటియాడి పద్మ, దొడ్డి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ ఫోరం వైస్ ప్రెసిడెంట్‌గా లజపతిరాయ్



లజపతిరాయ్



విజయకుమార్



కాళిదాసురెడ్డి

సాక్షి, విశాఖపట్నం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం విభాగం కమిటీ నియామకం జరిగింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం విభాగం కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ప్రొఫెసర్ హెచ్.లజపతిరాయ్, అధికార ప్రతినిధిగా ప్రొఫెసర్ కిర్ల విజయకుమార్, ఫోరం సెక్రటరీగా నీలాపు కాళిదాసు రెడ్డిని నియమించారు. శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో కొత్తగా ఐదు డయాలసిస్ మెషీన్లు



అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో డయాలసిస్ రోగులకు ప్రభుత్వం కొత్తగా వార్డును ఏర్పాటు చేసి, కావలసిన పరికరాలు సమకూర్చినట్టు వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఐదు మిషన్లు వచ్చాయని, త్వరలో రోగులకు అందుబాటులోకి తీసుకుని రావడం జరుగుతుందన్నారు.

12న వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- గ్రామీణ స్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకూ పార్టీ జెండావిష్కరణలు
- ఈ సందర్భంగా సూపర్ సిక్స్ హామీల అమలు కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు

అనకాపల్లి టౌన్ : జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 12న ఘనంగా నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పేర్కొన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా గ్రామీణ స్థాయి నుంచి వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. అదే రోజు ఉదయం తొమ్మిది గంటలకు నియోజకవర్గ ప్రధాన కేంద్రాలు, మండల కేంద్రాలలో జెండా ఎగుర వేసి, అనంతరం నాయకులు, కార్యకర్తలు జిల్లా ప్రధాన కేంద్రంలో జరిగే వేడుకలకు విచ్చేస్తారని ఆయన తెలిపారు. అక్కడి నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని సూపర్ సిక్స్ హామీలపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ప్రజలను మోసం చేయడంపై కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి కార్యకర్త పాల్గొనాలని ఆయన కోరారు. తల్లికి వందనం, విద్యాదీవెన, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్, 50 ఏళ్లకే పింఛన్...ఇలా ఏ ఒక్క హామీ కూడా కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏ పథకానికీ నిధులు కేటాయించలేదని, దీనిని బట్టి హామీలన్నీ ఉత్తుత్తివే అని నిరూపణ అయిందన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, కశింకోట ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్ మలసాల రమణారావు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూకాంబిక అమ్మవారికి రూ.2 లక్షల విరాళం



నూకాంబిక అమ్మవారి ఆలయాభివృద్ధికి రూ.2 లక్షల విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: మండలంలోని చూచుకొండలోని నూకాంబిక అమ్మవారి ఆలయాభివృద్ధికి తన వంతు సాయంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ శనివారం రూ.2 లక్షల విరాళం అందజేశారు. సర్పంచ్ దొడ్డి సూరప్పారావు, ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ పెంటకోట అప్పల నాయుడు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి పెంటకోట హరేరామ, వైఎస్సార్‌సీపీ నేతలు గుంట్ల అప్పారావు, పిన్నమరాజు రవీంద్రరాజు, వ్యాపారవేత్త ఆడారి కృష్ణ, శంకర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

22 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

గొలుగొండ : కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లూరి పార్కు వద్ద స్కూటీపై అక్రమంగా 22 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. అనంతపూర్ జిల్లాకు చెందిన మనోహర్(22), గూడెం కొత్తవీధికి చెందిన వెంకటేష్ (32) స్కూటీపై 22 కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. నిందితులిద్దపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించి, మూడు సెల్‌ఫోన్లు స్వాదీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నర్సీపట్నం : చెట్టుపల్లి–పాత లక్ష్మీపురం మధ్యలో శనివారం తెల్లవారి జరిగిన రోడ్డు ప్రమాదంలో అయ్యన్న కాలనీకి చెందిన పెదిరెడ్ల జగదీశ్వరరావు (36) మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ రాజారావు తెలిపారు. జగదీశ్వరరావుతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వడ్డాది నుంచి తిరిగి వస్తుండగా తెల్లవారి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో జగదీశ్వరరావు మృతి చెందగా సతీష్, లోవరాజు గాయపడ్డారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మిల్క్ బ్యూటీ మెరుపులు

రాడిసన్ బ్లూలో ఫ్యాషన్ షో అదుర్స్

కొమ్మాది (విశాఖ): కళ్లు మిరుమిట్లు గొలిపే లైటింగ్.. ఉర్రూతలూగించేలా డీజే పాటలు.. ఒయ్యారాలు వలికిస్తూ అందమైన మోడల్స్ ర్యాంప్ వాక్‌తో ఫ్యాషన్ షో అదరహో అనిపించింది. శనివారం సాయంత్రం రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో నిర్వహించిన బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ కార్యక్రమం వీక్షకులను కనువిందు చేసింది. సినీ తార తమన్నా భాటియా ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. నల్లటి మోడ్రన్ డ్రెస్‌లో ర్యాంప్‌పై మిల్క్ బ్యూటీ వాక్ చేయడంతో సందర్శకులు ఫిదా అయిపోయారు. ఇతర మోడల్స్ కూడా ఆధునిక దుస్తుల్లో ర్యాంప్‌పై సందడి చేశారు. ఈ ఫ్యాషన్ షోను చూసేందుకు భారీ సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. ఫ్యాషన్ షో, డీజేతో పాటు రుచికరమైన వంటకాలను అందించారు.

వెంకన్న పెళ్లికొడుకాయెనే



ఉపమాక వెంకన్న ఆలయం

- ఉపమాక వేంకటేశ్వరస్వామి కల్యాణానికి అంకురార్పణ నేడు
- ఉదయం పెండ్లి కావిడి ఊరేగింపు
- 10వ తేదీ రాత్రి కల్యాణం
- ఘనంగా ఏర్పాట్లు చేసిన టీటీడీ

నక్కపల్లి:

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణానికి నేడు అంకురార్పణ జరగనుంది. మార్చి 10వ తేదీ సోమవారం రాత్రి ఉపమాకలో గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో షడ్భుజాలతో స్వయం వ్యక్తమై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణం ఘనంగా జరగనుంది. ప్రతి ఏటా ఫాల్గుణ శుద్ధ ఏకాదశి నాడు స్వామివారి వార్షిక కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహిస్తారు. ఈ కల్యాణాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మార్చి 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. వార్షిక కల్యాణానికి సంబంధించి 9వ తేదీ ఆదివారం ఉదయం స్వామివారి పెండ్లి కావిడను ఉపమాక మాడ వీధుల్లో ఊరేగిస్తారు. భక్తులు స్వామివారికి పసుపు కుంకుమలు, కొబ్బరికాయలు కానుకగా సమర్పిస్తారు. సాయంత్రం ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ఋత్విక్‌వరుణ, కంకణధారణ, అంతరాలయ పూజ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పిస్తారు. తదుపరి సాయంత్రం అంకురార్పణకు శ్రీకారం చుడతారు. సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో ఉంచి మత్సంగ్రహణం (పుట్టమన్ను) తీసుకు రావడానికి ఉత్తర ఈశాన్య దిక్కున గల ప్రాంతానికి తీసుకెళ్తారు. అనంతరం అశ్వవాహనంపై తిరువీధి సేవ జరుగుతుంది. స్వామి, అమ్మవార్లను అశ్వవాహనంలో ఉంచి మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహిస్తారు. తర్వాత స్వామివారి కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను కొలువుదీరుస్తారు. అంకురార్పణ చతుస్థాన అర్చనలు గరుడప్పాల నివేదన నిర్వహిస్తారు. దీంతో స్వామివారి కల్యాణ ఉత్సవాలు ప్రారంభమైనట్లేనని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు.10వ తేదీ ఉదయం ఉభయ దేవేరులను పెద్దపల్లకిలో కొలువుదీర్చి ఆలయం, గ్రామంలో అష్టదిక్పాలకులను ఆవాహన చేసిన తర్వాత ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతుంది. అదే రోజు రాత్రి వేంకటేశ్వర స్వామిని ఇత్తడి గరుడ వాహనంపై, ఉభయ దేవేరులను శేష వాహనంపై ఉంచి ఉపమాక సింహాద్రాచార్యులు ఇంటి వద్ద కన్యావాద సంవాదం (ఎదురు సన్నాహ మహోత్సవం) నిర్వహిస్తారు. ప్రముఖ వేద పండితురాలు డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీదేవి వ్యాఖ్యాతగా వ్యవహరించి ఎదురు సన్నాహ మహోత్సవం నిర్వహిస్తారు. అనంతరం రథోత్సవం, కల్యాణం జరుగుతుంది.



బేడా మండపం, ఆస్థాన మండపం చుట్టూ భక్తుల కోసం వేసిన టెంట్లు

300 మంది పోలీసులతో బందోబస్తు..

జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాల మేరకు కల్యాణోత్సవాలకు సుమారు 300 మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సీఐ కుమారస్వామి తెలిపారు. ఆరుగురు సీఐలు, 20 మంది ఎస్ఐలతో పాటు, స్పెషల్ బ్రాంచి పోలీసులు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు, హోం గార్డులు, మఫ్టీలో సిబ్బంది భద్రత కోసం పని చేస్తారన్నారు. 16 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, డ్రోన్ కెమెరాల సాయంతో భద్రత పర్యవేక్షిస్తామన్నారు. మనబానవానిపాలెం, నక్కపల్లిలో పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలు కేటాయించామన్నారు. ఉపమాక వెళ్లే అన్ని మార్గాల్లోను చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. 10వ తేదీ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాత్రమే ద్విచక్ర వాహనాల రాకపోకలను అనుమతిస్తామన్నారు.

వేసవి తాపాన్ని తట్టుకునేలా ఏర్పాట్లు..

వేసవి సమీపించడంతో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వెంకన్న కల్యాణాన్ని తిలకించడాన్ని ఉత్తరాంధ్ర భక్తులు ఎంతో మక్కువ చూపుతారు. ఆలయ రాజగోపురం ఎదురుగా భారీ సైజులో టెంట్లు, షెడ్లు, మెట్ల మార్గం వద్ద రెయిలింగ్ ఏర్పాటు చేశారు. పుష్కరిణిలో స్నానమాచరించే భక్తులు ప్రమాదానికి గురి కాకుండా రక్షణ ఏర్పాట్లు చేశారు. ఉత్సవ మూర్తుల గర్భాలయం, బేడా మండపాల చుట్టు పెంటార్లు వేశారు. అలాగే ధ్వజస్తంభం, రాజగోపురం ఎదురుగా అఖిలాండం నుంచి ప్రత్యేక ఇనుప గ్రిల్స్‌తో క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉపమాక పెద్ద చెరువు, మనబాన వానిపాలెం సెంటర్లలో స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద మెయిన్‌రోడ్డు, మాడవీధులు, గరుడాద్రి పర్వతం తదితర ప్రాంతాల్లో భారీ విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేయడంతో ఆలయ ప్రాంగణం కాంతులీనుతోంది. ఈ ఏడాది కల్యాణోత్సవాలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షమంది తరలి వస్తారని పోలీసు శాఖ అంచనా వేస్తోంది. ఆలయ ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులు, పుష్పాలతో అలంకరణ చేశారు. భక్తులకు సదుపాయాలు కల్పిస్తున్నారు.



ప్రధాన రాజగోపురం ఎదురుగా భక్తుల కోసం ఏర్పాటు చేసిన భారీ షెడ్లు

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకున్నది వైఎస్సార్‌సీపీనే



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ

అనకాపల్లి టౌన్: వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో 89.90 లక్షల నిధులు తీసుకొచ్చి గోవాడ సుగర్ ఫ్యాక్టరీని అన్ని విధాలా ఆదుకుందని అనకాపల్లి జిల్లా పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం సుగర్ ఫ్యాక్టరీ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. క్రషింగ్‌కి అనుకూల పరిస్థితులు కల్పించడంలో ఇక్కడి ఎంపీ, ఎమ్మెల్యేలు విఫలమయ్యారన్నారు. ప్రతి ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో ప్రారంభం కావల్సిన క్రషింగ్ నేటికీ పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదన్నారు. ఇప్పటికి లక్షా 50 వేల టన్నులు క్రషింగ్ జరగాల్సి ఉండగా కేవలం 60 టన్నుల క్రషింగ్ మాత్రమే జరిగిందన్నారు. ఈ క్రమంలో రైతులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకోవడానికి ఈ నెల 10న రాష్ట్ర శాసన మండలి సభ్యులు బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా ముఖ్య నాయకులు ఫ్యాక్టరీని సందర్శించి రైతులు, యాజమాన్యంతో చర్చిస్తారన్నారు. సమస్యల పరిష్కారానికి తగిన సూచనలు చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, కశింకోట ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్ మలసాల రమణారావు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత సమాజమే ధ్యేయం

- నవోదయం 2.0 రథాన్ని ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర



నవోదయం 2.0 రథాన్ని, పోస్టర్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర

తుమ్మపాల : నాటుసారా రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు గ్రామ గ్రామాన ప్రజల్లో నాటు సారాకు వ్యతిరేకంగా చైతన్యం కలిగించడమే లక్ష్యంగా ప్రచార రథాన్ని ప్రారంభించినట్టు జిల్లా ఇన్‌చార్జి, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. నాటు సారా రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం ప్రారంభించిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా పట్టణంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతో పాటు స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు, ఎంపీ సీఎం రమేష్, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా , జేసీ జాహ్నవిలు విచ్చేసి పోస్టర్, రథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారాను పూర్తిగా నియంత్రించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత అందరిలో ఉందన్నారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సుర్జిత్ సింగ్ మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 202 నాటుసారా కేసులు నమోదు చేసి, 107 మంది నిందితులను అరెస్టు చేయడమైందన్నారు. 1,022 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారీలో ఉపయోగించే 69, 260 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేసి, 15,289 కేజీల బెల్లం స్వాధీన పరుచుకున్నామని, 10 వాహనాలను జప్తు చేశామని, అదేవిధంగా 550 మంది పాత నేరస్తులపై నిఘా ఉంచి వారిపై బైండ్ ఓవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుధీర్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.రాజశేఖర్, ఎక్సైజ్ సీఐ వై.లక్ష్మన్నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం



మాట్లాడుతున్న 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య

అనకాపల్లి టౌన్: లోక్ అదాలత్‌లో రాజీమార్గమే రాజ మార్గమని, ఇక్కడి తీర్పే అంతిమమని 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. శ్రీవిద్య అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడారు. ఈ అదాలత్‌లో 1101 కేసులు పరిష్కరించి, ఐదు కోట్ల ముప్పై రెండు లక్షల పదిహేడు వేల రెండు వందలు కక్షిదారులకు చెల్లించామన్నారు. నాలుగు బెంచ్‌లలో జరిగిన కార్యక్రమంలో సుమారు 650 మంది కక్షిదారులు పాల్గొని తమ కేసులను పరిష్కరించుకున్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి పి. నాగేశ్వరరావు, సీనియర్ డివిజన్ జడ్జి జి. రామకృష్ణ, సీనియర్ డివిజన్ అడిషనల్ సివిల్ జడ్జి బి.వి. విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎస్ కుమార్, కార్యదర్శి బీఎస్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకరంగా మెదడు, నాడీ వ్యవస్థ రుగ్మతలు

- అంతర్జాతీయ న్యూరో సర్జరీ వైద్య నిపుణుడు, ప్రొఫెసర్ మళ్ల భాస్కరరావు



డాక్టర్ భాస్కరరావును సత్కరిస్తున్న గౌరీ గ్రంథాలయం సభ్యులు

అనకాపల్లి టౌన్ : మెదడు, నాడీ వ్యవస్థను ప్రభావితం చేసే రుగ్మతల నియంత్రణకు ప్రభుత్వాలు తక్షణం చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ న్యూరో సర్జరీ వైద్య నిపుణులు, నిమ్‌హేన్స్ బెంగళూరు ఆస్పత్రి పూర్వ అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ మళ్ల భాస్కరరావు సూచించారు. స్థానిక గౌరీ గ్రంథాలయం 83వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఇక్కడ న్యూరో వ్యాధి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు మెదడు, నాడీ సంబంధ వ్యాధులతో అంతర్గతంగా బాధపడుతున్నారని అధ్యయనంలో తేలిందన్నారు. దేశ జనాభాలో 2019 నాటికి 37.9 శాతం మంది బ్రెయిన్ స్ట్రోక్ నియోనాటల్ ఎన్సెఫలోపతి (మెదడు గాయం), మైగ్రేన్, చిత్తవైకల్యం, డయాబెటిక్ న్యూరోపతి (నరాల నష్ట), మెనింజైటిస్, మూర్ఛ, ఆటిజం స్పెక్ట్రమ్ రుగ్మత, నాడీ వ్యవస్థ క్యాన్సర్లు, అకాల జననం నుంచి వచ్చే నాడీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, ఈ శాతం 2024 నాటికి మరింత పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కువ శాతం 40 నుంచి 58 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పురుషులు ఈ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, కన్వీనర్ మళ్ల బాపునాయుడు, అధ్యక్షుడు కాండ్రేగుల జగ్గారావు, కాండ్రేగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రేపు విధుల బహిష్కరణ

అనకాపల్లి: డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా పథకంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 10, 17, 24 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా విధులు బహిష్కరిస్తున్నట్లు ఏపీఏఎండీవో ఈయూ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ గోవింద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్‌టీఆర్‌వీఎస్ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తుందని, ఆప్కాస్ రద్దు దిశగా ఇప్పటికే అడుగులేసిన ప్రభుత్వం ఏప్రిల్ నుంచి బీమా సేవలు కొనసాగుతాయని తెలియజేస్తుందన్నారు. రాష్ట్రంలో గత 17 సంవత్సరాలుగా ప్రజలకు ఉచిత సేవలందించడంలో కీలకపాత్ర పోషించిన ఫీల్డ్ సిబ్బంది మొత్తం ప్రభుత్వాల నుంచి ఎటువంటి లబ్ధి పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా లెక్కల్లో చూపించి కనీస వేతనాలు అమలు చేయకుండా అరకొర జీతాలతో 17 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

నేడు జాతీయ భద్రత వారోత్సవాలు

పరవాడ: జేఎన్‌పీసీ, ఎంఏఎస్‌ఆర్ఎం ఆధ్వర్యంలో అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో 54వ జాతీయ భద్రతా వారోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించనున్నామని ఎంఏఎస్‌ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు చెప్పారు. జేఎన్‌సీసీ ఎంఏఎస్‌ఆర్ఎం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం కానున్న జాతీయ భద్రత వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, హోం మంత్రి వంగలపూడి అనిత, విశాఖ మేయర్ జి.హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పాల్గొంటున్నారని చెప్పారు. అచ్యుతాపురం ఎస్ఈజెడ్, నక్కపల్లి, పరవాడ ప్రాంతాల్లో ఫార్మా పరిశ్రమల ప్రతినిధులు పాల్గొంటారని ఎంఏఎస్‌ఆర్ఎం కార్యదర్శి సుబ్బారావు తెలిపారు. అధ్యక్షుడు ప్రకాశరావు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న జేఎన్‌పీసీ ఎంఏఎస్ ఆర్ఎం కార్యదర్శి సుబ్బారావు

మంచినీటి ట్యాంక్ పైకి ఎక్కి యువకుడి హల్‌చల్

దేవరాపల్లి: దేవరాపల్లికి చెందిన గేదెల పవన్ (18) అనే యువకుడు ఆత్మహత్య చేసుకుంటానంటూ పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని మంచినీటి ట్యాంక్ పైకి ఎక్కి శనివారం రాత్రి హల్‌చల్ చేశాడు. స్థానికుల సమాచారం మేరకు వెంటనే ఎస్ఐ టి.మల్లేశ్వరరావు సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. యువకుడికి రెండు గంటల పాటు నచ్చజెప్పి క్షేమంగా దించి అతడి ప్రాణాలు కాపాడారు. మత్తు పానీయాలకు బానిసైన పవన్ ఆ మత్తులోనే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించినట్లు తెలిసింది. దేవరాపల్లి మోడల్ కాలనీకి చెందిన గేదెల ఈశ్వరరావు, గౌరీ దంపతుల కుమారుడు పవన్. ఈ క్రమంలో శనివారం తండ్రితో కలిసి కూలి పనికి వెళ్లిన డబ్బుల్లో రూ. 200 ఇవ్వాలని తండ్రిని పవన్ అడగ్గా ఉదయం ఇస్తానని చెప్పడంతో తండ్రిపై దాడి చేశాడు.

ఇంటికి సమీపంలోని ట్యాంక్‌పైకి ఎక్కి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్ చేశాడు. ఎస్ఐ మల్లేశ్వరరావు యువకుడిని ఇంటికి తీసుకెళ్లి అప్పగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

తోడల్లుడే చంపించాడు...

- నగేష్‌కుమార్ హత్య కేసులో ముగ్గురి అరెస్టు
- నిందితులకు 14 రోజుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జి డీఎస్పీ మోహనరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ మోహన్‌రావు

అనకాపల్లి : మండలంలో కుంచంగి గ్రామంలో ఈనెల 5వ తేదీన బుచ్చియ్యపేట మండలం కరక గ్రామానికి చెందిన భీమవరపు నగేష్‌కుమార్ హత్య కేసులో మృతుడి తోడల్లుడితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఇన్‌చార్జి డీఎస్పీ బి.మోహన్‌రావు చెప్పారు. డీఎస్పీ కార్యాలయంలో శనివారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మృతుడి తోడల్లుడు కశింకోట శివాలయం వీధికి చెందిన పెద్దపూడి కిషోర్, అదే గ్రామానికి చెందిన మారేడుపూడి రాజేష్, కాకినాడ జిల్లా భానుగుడి జంక్షన్, మిలిటరీ రోడ్డుకు చెందిన గోరస నాగేశ్వరరావు కలసి భీమవరపు నగేష్‌కుమార్‌ను హత్య చేసినట్టు ఆయన తెలిపారు. కిషోర్, రాజేష్‌లు అనకాపల్లిలోని ఓ బంగారం షాప్‌లో గతంలో పనిచేశారని, కిషోర్ కశింకోటలో కొత్తగా దుకాణం పెట్టుకుని వ్యాపారం సాగిస్తున్నాడని డీఎస్పీ చెప్పారు. కిషోర్ షాప్ వద్దకు రాజేష్ అప్పుడప్పుడు వస్తుండేవాడన్నారు. అదే సమయంలో కాకినాడలో ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉన్న రాజేష్ మేనల్లుడి కొడుకు గోరస నాగేశ్వరరావు కూడా కిషోర్ దుకాణానికి వచ్చేవాడు. అదే షాప్‌కు పెద్దపూడి కిషోర్ తోడల్లుడైన నగేష్‌కుమార్ కూడా వస్తుండడంతో వారి మధ్య పరిచయం ఏర్పడింది. వారంతా కలిసి వ్యాపార లావాదేవీలు సాగించే వారని, ఈ క్రమంలో వారి మధ్య గొడవలు ఉన్నాయని తెలిపారు. కాకినాడకు చెందిన గోరస నాగేశ్వరరావుకి షార్ట్ ఫిల్మ్ షూటింగ్ నిమిత్తం పిస్టల్ కావాలని నాగేష్‌ను అడగడంతో రూ.10వేలు అవుతుందని చెప్పి తీసుకున్నాడు. తరువాత నగేష్ ఒక డమ్మీ పిస్టల్ తీసుకువచ్చి చూపించి మళ్లీ తీసుకువెళ్లిపోయాడు. దాని నగదును కూడా తిరిగి నాగేశ్వరరావుకు ఇవ్వకపోవడంతో అతను నగేష్‌పై కోపం పెంచుకున్నాడన్నారు. అదే సమయంలో మృతుడి తోడల్లుడు పెదపూడి కిషోర్ కూడా నగేష్‌పై వివిధ కారణాలతో పగ పెంచుకుని అతనిని హత్య చేయాలని పథకం వేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 5న మృతుడు (భీమవరపు నగేష్‌కుమార్), తోడల్లుడు పెద్దపూడి కిషోర్, మారేడుపూడి రాజేష్, గోరస నాగేశ్వరరావు బుచ్చియ్యపేట మండలం రాజాం వద్ద ధాబాలో మద్యం సేవించారు. ముందుగా పథకం వేసుకున్న ప్రకారం కాకినాడకు చెందిన గోరస నాగేశ్వరరావును అనకాపల్లి జాతీయ రహదారిలో బైక్‌పై దించాలని నగేష్‌ను కోరడంతో అతను పల్సర్ బైక్‌పై ఎక్కించుకుని వస్తుండగా అనకాపల్లి మండలం కుంచంగి గ్రామానికి వచ్చేసరికి నాగేశ్వరరావు తన వెంట తీసుకు వచ్చిన సర్జికల్ బ్లేడ్‌తో బైక్ నడుపుతున్న నగేష్ పీక కోసి అక్కడి నుంచి పారిపోయాడు. అప్పటికే వెనుక వస్తున్న పెద్దపూడి కిషోర్, మారేడుపూడి రాజేష్ ఇద్దరూ నాగేశ్వరరావును అక్కడి నుంచి బైక్‌పై ఎక్కించుకుని కశింకోట జాతీయ రహదారిలో బస్ ఎక్కించి పంపేశారు. నిందితుల కాల్ డేటా ఆధారంగా కేసు ఛేదించినట్టు డీఎస్పీ వెల్లడించారు. విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్, ఎస్ఐ జి.రవికుమార్, పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ, ఏఎస్ఐ ఎస్.భాస్కర్‌రావు, హెచ్‌సీలు వై.సోమ్‌బాబు, కె.నూకరాజు, కానిస్టేబుళ్లు ఎస్.నారాయణ, పి.నరేంద్ర, ఎం.నగేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి కల్యాణం రేపు



కరపత్రాలను విడుదల చేస్తున్న ఈవో రాజసులోచన, చైర్మన్ శ్రీనివాస రావు

అనకాపల్లి: దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక దేమునిగుమ్మం స్వయంభూ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 10న స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో టి.రాజసులోచన, చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఇక్కడ ఆలయంలో కల్యాణోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 9న రాత్రి 7 గంటలకు స్వామివారి సంకల్పం, 10న స్వామివారి ఊరేగింపుతోపాటు కల్యాణం నిర్వహిస్తామన్నారు. 13న గరుడ వాహన సేవ, 14న డోలోత్సవం, 15న మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పులకండం గిరిబాబు, ప్రలకండం ప్రసాద్‌బాబు, ఆలయ ధర్మకర్తలు గోలి మురళి, సీహెచ్ నూకరాజు, వేదుల సూర్యప్రభ, కొణతాల అరుణ, సోమాదుల తులసి పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సత్యనారాయణ

తుమ్మపాల: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే తమ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ డీజీఎం కె.సత్యనారాయణ తెలిపారు. శనివారం రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో వార్షికోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతోపాటు ఆరోగ్యం కాపాడుకుంటూ వ్యాయామం చేయాలన్నారు. ఆర్థికం చాలా అంశాలపైన అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ ఐ.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకుని పరిశ్రమల అవసరాలకు తగ్గట్లు తమను తాము మలుచుకోవాలన్నారు. అంతకుముందు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో విభాగ అధిపతులు, లెక్చరర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

16న పడమటమ్మ తీర్థం

కశింకోట: స్థానిక కస్పావీధిలో పడమటమ్మ తీర్థ మహోత్సవాన్ని ఈ నెల 16న పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆ రోజు మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన, 3 గంటలకు ఎడ్ల బళ్ల పరుగు పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేత బళ్ల నిర్వాహకులకు బహుమతులు అందజేస్తామన్నారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 6,260 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,580
మొదటి రకం	3,560	4.160
రెండో రకం	3,240	3,780
మూడో రకం	3,030	3,230

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్	: రాజా
పౌరుషం	: సత్యనారాయణ స్క్రీన్-2 (ఉదయం, మ్యాట్నీ)
యాంటీరేష్	: సత్యనారాయణ స్క్రీన్-2 (1, 2 షోలు)
మజాకా	: పర్తిసాయి
ఛావా	: షిర్డీసాయి
కింగ్‌స్టన్	: వెంకటేశ్వర
తండేల్	: శ్రీసత్య
శబ్దం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 81 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-31 యూనిట్లు, ఓ పాజిటివ్-40 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 427 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 363 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

- అధ్వానంగా కశింకోట ఆర్టీసీ బస్సు స్టేషన్
- రాళ్లు తేలి గోతులమయం
- ఎగసి పడుతున్న దుమ్ము, ధూళి
- ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు



బస్సు వస్తే రేగుతున్న దుమ్ము, ధూళి

దుమ్ము రేగుతోంది...!

కశింకోట: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్థానిక ఆర్టీసీ బస్సు స్టేషన్ ముఖచిత్రాన్ని మార్చుతున్న తరుణంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో బ్రేకులు పడ్డాయి. ఆ తర్వాత కూటమి అధికారం లోకి రావడంతో ఎక్కడ గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. దాంతో ఇక్కడ అధ్వాన రోడ్డుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై రాళ్లు తేలి, గతుకులు పడి బస్సు వచ్చినప్పుడు దుమ్ము, ధూళి ఎగసి పడుతోంది. ఏ మాత్రం వర్షం పడినా బురదమయంగా మారి అడుగు వేస్తే అడుగు వేయలేని స్థితిలో ఉంటోంది. ప్రయాణికులు ఇక్కడకు రావడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది.

కశింకోటలో 20 వేలకు పైగా జనాభా ఉంది. వీరితోపాటు 2 వేల జనాభాపైగా ఉన్న వెదురుపర్తి గ్రామస్తులు బస్సు సౌకర్యం లేక ఆటోల్లో కశింకోటకు చేరుకుంటారు. రోజూ వందలాది ప్రయాణికులు, విద్యార్థులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. 1999లో ఇక్కడ బస్సు స్టేషన్ నిర్మించారు. ఈ బస్సు స్టేషన్‌లోకి జాతీయ రహదారి నుంచి యలమంచిలి-అనకాపల్లి మార్గంలో బస్సులు ప్రవేశించి విశాఖ వైపు వెళ్తాయి. అయితే స్టేషన్‌లోకి వచ్చే రోడ్డు చాలా అధ్వానంగా ఉంది. పెద్ద గోతులు పడి, రాళ్లు తేలి నడవలేని స్థితిలో ఉంది. బస్సులు కూడా గోతుల్లో నుంచి



దెబ్బతిన్న బస్సు స్టేషన్ ముందు భాగం

కష్టం మీద చేరుకుంటున్నాయి. బస్సులు వచ్చినప్పుడు, ఆగి వెళ్లేటప్పుడు స్టేషన్‌లో దుమ్ము, ధూళి ఎగసి ప్రయాణికులపై పడుతుండటంతో దుస్తులు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షం పడితే అంతా బురదమయంగా మారుతోంది. ఇక లోపలికి రాలేని పరిస్థితి. అయినా గత్యంతరం లేక స్టేషన్‌లోకి బస్సు ప్రయాణానికి రాక తప్పక ఇబ్బంది పడి చేరుకోవలసి వస్తోందని వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో మరమ్మతులు...

గతంలో మరింత అధ్వానంగా ఉన్న బస్సు స్టేషన్‌ను ఏడాది క్రితం వైఎస్సార్‌సీపీ హయాంలో బస్సు స్టేషన్ ప్రాంతాన్ని సుమారు రూ.పది లక్షలు ఖర్చు చేసి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రోత్సాహంతో రాళ్లు, మెటల్ వేసి వెడల్పు చేసి



రోడ్డు బాగోకపోవడంతో అటు నుంచి అటే వెళ్లిపోతున్న పల్లె వెలుగు బస్సు

ఎత్తు చేశారు. దానిపై పక్కాగా తారురోడ్డు వేయడానికి కూడా ప్రయత్నాలు చేస్తుండగా సార్వత్రిక ఎన్నికలు ముంచుకు రావడంతో పనులు ముందుకు సాగలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు అవుతున్నా కూడా దీని గురించి పట్టించుకోలేదు. దీంతో తమకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

బస్సు స్టేషన్లోకి రాకుండా వెళ్లిపోతున్న బస్సులు..

స్టేషన్‌లో రోడ్డు బాగుండక కొన్ని బస్సులు లోపలికి రాకుండా అట్నుంచి అటే జాతీయ రహదారి మీదుగా నేరుగా వెళ్లిపోతున్నాయి. దీంతో సకాలంలో గమ్యాలకు చేరుకోలేకపోతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సు స్టేషన్ ముందు భాగం శిథిలావస్థకు చేరుకుంది. దీనివల్ల శిథిలాలు ఎప్పుడు మీద పడతాయోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని దృష్ట్యా ఇప్పటికైనా బస్సు స్టేషన్ రోడ్డును సిమెంట్‌గాని, తారు రోడ్డుగా గాని అభివృద్ధి చేసి కష్టాలు తొలగించాలని కోరుతున్నారు. ఇందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. శిథిలమవుతున్న ముందు భాగానికి మరమ్మతులు చేపట్టాలంటున్నారు.

రాళ్లు తేలిపోయాయి



కశింకోటలో బస్సు స్టేషన్ రోడ్డు గతుకులు పడి రాళ్లు తేలి ఉంది. బస్సు ఎక్కి దిగేటప్పుడు ఏ రాయిని తన్నుకొని పడిపోతామేమోనని భయంగా ఉంది. గోతుల్లో పడితే గాయపడటం ఖాయం. వర్షం వస్తే బురద గుంటలా మారుతోంది. అయినా ఎవరూ పట్టించుకోకపోవడం శోచనీయం. రోడ్డు బాగులేక కొన్ని బస్సులు స్టేషన్‌లోకి రాకుండా నేరుగా వెళ్లిపోతున్నాయి. దాంతో సకాలంలో గమ్యాలకు చేరుకోలేకపోతున్నాం. సత్వరమే గతుకులు కప్పి, చదును చేసి మెటల్ రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేయాలి.

–రాజాన మహాలక్ష్మి, కశింకోట.

దుమ్ము, ధూళితో ఇబ్బంది



మా గ్రామానికి బస్సు సదుపాయం లేదు. దాంతో ఆటోలో కశింకోట బస్సు స్టేషన్‌కు చేరుకుంటాం. అక్కడ నుంచి అనకాపల్లి, విశాఖ తదితర దూర ప్రాంతాలకు బస్సుల్లో వెళుతుంటాం. అయితే బస్సు స్టేషన్‌లోకి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. మట్టి, మెటల్‌తో నిండి ఉండటం వల్ల బస్సు వస్తే దుమ్ము, ధూళి ఎగిరి మీద పడుతోంది. దుస్తులు పాడవుతున్నాయి. దీంతో స్టేషన్‌లోకి రావడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. దీన్ని తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలి.

– ఇందలి మంగ, వెదురుపర్తి గ్రామం, కశింకోట మండలం

ధ్యాన వేంకటేశ్వరస్వామికి అలంకరణ

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని పాల్గుణ మాసం శనివారం సందర్భంగా వజ్ర కవచంతోపాటు వివిధ పూలమాలలు, తులసీ మాలలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. నక్షత్ర హారతి ఇచ్చారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శించి పూజలు చేశారు. అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధి పనులు కల్పించాలని పాదయాత్ర

రావికమతం: గిరిజనులు, సీపీఎం నాయకులు కొండ శిఖర గ్రామాలకు ఉపాధి పనులు కల్పించాలని ప్రజా చైతన్య యాత్ర పేరిట పాదయాత్ర నిర్వహించారు. రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ నేరేడు బంధ నుంచి బంగారు బందల గ్రామం వరకు యాత్ర కొనసాగింది. చీమలపాడు పంచాయతీ కొండ శిఖర గ్రామాలైన నేరేడుబంధ, జీలుగులోవ, సోంపురం, బంగారు బందలు గ్రామాల్లో 30 కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరికి నేటికీ వారి గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించలేదని, తక్షణమే అందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ఆర్‌జీఎస్ పీడీని గ్రామంలో పనులు కల్పించాలని కోరగా, అలా చేయడం సాధ్యం కాదని, కిందకొచ్చి పని చేస్తే ప్రయాణ చార్జీలు ఇస్తామని చెబుతున్నారని గిరిజనులు తెలిపారు. అలా చేయాలంటే రాను పోను 8 కిలోమీటర్లు దూరం నడవాలని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

కె.కోటపాడు: చింతపాలెం గ్రామస్తులు శనివారం ఆంజనేయస్వామి తీర్థం ఘనంగా జరిపారు. ఉదయం నుండి స్వామికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మికి సత్కారం



ఎంపీపీ లక్ష్మితోపాటు హాజరైన స్వయం సహాయక సంఘాల, ఉపాధి మహిళలు

కశింకోట: మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి కృషి చేయాలని ఎంపీపీ కలగా లక్ష్మి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు పురుషులతో దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళల అభివృద్ధికి విద్య దోహదపడుతుందన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఉన్నత చదువులు చదివి ఉన్నత పదవులు అలంకరించి అభివృద్ధి చెందాలన్నారు. సమాజంలో మహిళల పాత్ర ఉన్నతమైనదని, వారు లేకపోతే మానవ వనుగడ లేదన్నారు. కుటుంబంలో పురుషులతోపాటు మహిళలకు సమాన హక్కు ఉందన్నారు. మహిళలు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించాలన్నారు. రాజకీయాల్లోకి వచ్చి ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈవోపీఆర్డీ ఎం. వెంకటలక్ష్మి మాట్లాడుతూ మహిళలు లేని రంగం లేదని, పురుషులకు తీసిపోని విధంగా రాణిస్తున్నారన్నారు. వెలుగు ఏపీఎం పార్వతీబాయి మాట్లాడుతూ మహిళలు విద్యను అభ్యసించడంతోపాటు స్వయం ఉపాధి కల్పించుకొని అభివృద్ధి సాధించాలన్నారు. బాలికలకు 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేస్తున్నారని, ఇది చట్ట విరుద్ధమన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కలగా లక్ష్మిని దుశ్శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శీరం వెంకటలక్ష్మి, ఉపాధి పథకం టెక్నికల్ అసిస్టెంట్‌లు శివాని, కుమారి, ఇందిరా ప్రియదర్శిని ఎస్సీ మహిళా సంఘం అధ్యక్షురాలు లక్ష్మి, మండల పరిషత్ స్వీపర్ నారాయణమ్మలకు దుశ్శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఏపీఎంలు ఎం. శ్రీనివాసరావు, శివ పాల్గొన్నారు.

ఉద్యోగుల విద్యుత్ చౌర్యం

- ఈవీ స్కూటర్లకు చార్జింగ్

తుమ్మపాల: సచివాలయాల్లో ఉద్యోగులు దర్జాగా విద్యుత్ చౌర్యం చేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు అన్నట్లుగా మార్టూరు సచివాలయంతో పాటు రైతు సేవా కేంద్రం వద్ద తమ ఈవీ వాహనాలకు దర్జాగా విద్యుత్ చార్జింగ్ పెడుతున్నారు. కంచే చేను మేసినట్లు ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేయవలసిన ఉద్యోగులే ఇలా సొంత అవసరాలకు వృథా చేయడంపై గ్రామస్తులు అసహనం చేస్తున్నారు. రోజూ విధులకు వచ్చినప్పటి నుంచి చార్జింగ్ ఫుల్ చేసుకుని ఈవీ స్కూటర్లను వినియోగిస్తు అధిక విద్యుత్ వినియోగానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మార్టూరులో సచివాలయం, రైతు సేవా కేంద్రాల్లో ఉద్యోగులు రోజూ రెండు ఈవీ వాహనాలకు ఒకే సారి చార్జింగ్ పెడుతున్నారని తెలిపారు.



మార్టూరు సచివాలయం, రైతుసేవా కేంద్రంలో చార్జింగ్ అవుతున్న ఉద్యోగుల ఈవీ స్కూటర్లు

ఆడపిల్ల పుడితే లక్ష్మీదేవిగా భావించాలి

- మాజీ ఎంపీ సత్యవతి

అచ్యుతాపురం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం అచ్యుతాపురంలో ఘనంగా నిర్వహించారు. ఇక్కడ రహదారుల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి మహిళల గౌరవాన్ని ఎస్ఐ సుధాకర్ చాటి చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఆయన అన్నారు. అనకాపల్లి మాజీ ఎంపీ బి.వి సత్యవతి మాట్లాడుతూ ఇంట్లో ఆడపిల్ల పుడితే లక్ష్మీదేవి పుట్టిందని భావించాలన్నారు. వైద్య వృత్తి ద్వారా సమాజానికి ఎంతో సేవ చేశానన్నారు. ఇదే వృత్తిలో మహిళలకు గౌరవం పెరుగుతుందన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని ప్రతి విద్యార్థి గుర్తించి విలువలతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ మంచి ఆలోచనా విధానంతో సమాజంలో సేవా భావం కలిగి ఉండాలన్నారు. మాతృత్వం కోసం తమ ప్రాణాలనే పణంగా పెట్టి జన్మనిస్తున్న తల్లికి పిల్లలు ఎన్నడూ కంటతడి పెట్టకుండా చూసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సత్యవతి

మందుబాబులకు రూ.3 లక్షల జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 30 మందికి కోర్టు రూ.3 లక్షలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. శనివారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేపగుంట సింహపురి కాలనీ వద్ద మామిడితోటలో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న పేకాట శిబిరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.10,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కె.వి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు స్టేషన్లకు 'పది' ప్రశ్నపత్రాలు

కశింకోట: కశింకోట, తాళ్లపాలెం పరీక్ష కేంద్రాలకు సంబంధించిన మొదటి విడత ప్రశ్నపత్రాలను కశింకోట పోలీసు స్టేషన్‌కు, నరసింగబిల్లికి సంబంధించి యలమంచిలికి, కన్నూరుపాలేనికి సంబంధించి మాకవరపాలెం పోలీసు స్టేషన్లకు శనివారం పోలీసు బందోబస్తు మధ్య చేర్చారు. ఈ సందర్భంగా ఎంఈవో కె.ఎస్.ఎన్. మూర్తి మాట్లాడుతూ మండలంలో ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఏడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కశింకోటలో బాలికల హైస్కూలు, డీపీఎస్ జెడ్పీ హైస్కూలు, సెయింట్ జాన్స్ హైస్కూలు, తాళ్లపాలెంలో హైస్కూలు, బాలికల గురుకుల పాఠశాల, నరసింగబిల్లి, కన్నూరుపాలెం హైస్కూళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కలిసి 830 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. కశింకోట, తాళ్లపాలెం కేంద్రాల్లో జంబ్లింగ్ విధానంలో పరీక్షలు జరగనున్నాయన్నారు. వెదురుపర్తి హైస్కూలు విద్యార్థులు కశింకోటలో పరీక్ష కేంద్రాలకు, బయ్యవరం, జమాదులపాలెం, కొత్తపల్లి హైస్కూళ్ల విద్యార్థులు తాళ్లపాలెం కేంద్రాలకు, ఏఎస్ పేట హైస్కూలు విద్యార్థులు నరసింగబిల్లి కేంద్రానికి వెళ్లి పరీక్షలు రాస్తారన్నారు.

అప్పన్నను దర్శించుకున్న డీఆర్ఎం లలిత్‌బోరా



డీఆర్ఎమ్ లలిత్‌బోరాకి ప్రసాదం అందజేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్‌బోరా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ప్రోటోకాల్ సూపరింటెండెంట్ సూర్యనారాయణ ఆయనకు ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రమేష్‌కుమార్ కూడా..

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్.రమేష్‌కుమార్ దర్శించుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

నేత్రపర్వం.. నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వామికి సహస్రనామార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చి, 1001నామాలతో అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

కమనీయం..కల్యాణం

అప్పన్న నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉత్సవ మూర్తులను ఉంచి, ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా జరిగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి గరుడసేవ శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడ వాహనంపై ఆసీనులను చేసి, అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. హారతి అందజేశారు.

మహిళల భద్రత కోసం కృషి



సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ



వివిధ పోటీల్లో విజేతలకు బహుమతుల అందజేత

కశింకోట: మహిళలు భద్రత, సమాన హక్కుల సాధన కోసం కృషి చేయాలని సీఐ అల్లు స్వామినాయుడు కోరారు. ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బాలికల హైస్కూలు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలన్నారు. దీన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం కాగలవన్నారు. మహిళా సాధికారత, సురక్షిత సమాజ నిర్మాణంపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి వారం రోజులపాటు ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించామన్నారు. ర్యాలీ సందర్భంగా బాలికలు ప్లకార్డులు పట్టుకొని మహిళా సాధికారతపై నినాదాలు చేశారు. సమాజంలో మార్పు తీసుకురావలసిన అవసరాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వ్యాస రచన, వక్తృత్వ, చిత్ర లేఖనం వంటి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్ఐలు కె. లక్ష్మణరావు, పి. మనోజ్‌కుమార్, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతి సాధించాలి

- డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు
- ఘనంగా మహిళా దినోత్సవం



కస్పావీధి పాఠశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న బల్లా నాగభూషణం


అనకాపల్లి: పట్టణ, మండలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. భీమునిగుమ్మం హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎం.రాజ్యలక్ష్మిని డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను అధోహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి పొన్నాడ అప్పారావు, ఉపాధ్యాయులు ఎ.శ్రీధర్‌రెడ్డి, రామలింగేశ్వరరావు, ఏఎస్‌వో వెంకటేశ్వరరావు, పెనుమత్స కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానిక గవరపాలెం కస్పావీధి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం మాట్లాడుతూ సృష్టిలో మహిళలకు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం 4, 5 తరగతి విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వినకోట నీలేష్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భీమునిగుమ్మం హైస్కూల్‌లో హెచ్‌ఎం రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న డీఈవో అప్పారావు నాయుడు

ఎన్టీఆర్ ఆస్పత్రిలో...

స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలోని ఆయుర్వేద విభాగంలో మహిళా వైద్యులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. అంతకుముందు ముందు ఆయుర్వేద విభాగం వైద్యురాలు కె.లావణ్య ఆధ్వర్యంలో ఆటల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ ఆస్పత్రి ఆయుర్వేద విభాగంలో వైద్యులు, మహిళలు